సాక్షి
వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 12 । మార్చి । 2023



సంచలనానికి నాంది..!
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేటితో 13వ వసంతంలోకి అడుగు పెట్టనుంది. -8లో..



ఆరుగురు 'ఎర్ర' దొంగల అరెస్ట్
ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరుగురిని బద్వేల్ అటవీశాఖ అధికారుల బృందం అరెస్ట్ చేసింది. -8లో..

గరిష్టం/కనిష్టం
34.4/17.8

వాతావరణం
జిల్లాలో శనివారం 17.8 – 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

ష్..గప్‌చుప్



- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం
- హోరెత్తించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- చీలిక దిశగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఓట్లు
- ఏకపక్షంగా మద్దతు తెలుపుతున్న ప్రవేటు ఉపాధ్యాయులు
- గెలుపు ధీమాతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, కడప: పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలు క్లైమాక్స్‌కు చేరాయి. ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడింది. ప్రచార మోత మోగించిన మైకులు మూగబోయాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీబరిలో 49 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలో 12 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష టీడీపీలతోపాటు పీడీఎఫ్, స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈనెల 13న సోమవారం పోలింగ్ నిర్వహణకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కర్నూల్, అనంతపురం, కడప జిల్లాల పరిధిలో రాజకీయ పార్టీల బలబలాలను అంచనా వేసుకుంటూనే సమీకరణల విశ్లేషణలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారు వెన్నపూస రవీంద్రారెడ్డి, పీడీఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు, టీడీపీ మద్దతుదారు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి మధ్య ప్రధాన పోటీ ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత ఎన్నికల కంటే ఓట్ల సంఖ్య భారీగా పెరగడం, అందులో యువకుల ఓట్లు అధికంగా ఉండటంతో అధికార వైఎస్సార్‌సీపీ విజయం తధ్యమనే ధీమాతో ఉంది. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను గతంలో అన్నీ తానై నడిపించిన వెన్నపూస రవీంద్రారెడ్డి ఈమారు అభ్యర్థి కావడంతో ప్రచారం నుంచి ఎన్నికల వ్యూహాల వరకూ కలిసి వచ్చినట్లుగా వారు వివరిస్తున్నారు. మూడు ఉమ్మడి జిల్లాల్లో 38 మంది ఎమ్మెల్యేలుంటే వారిలో ఇద్దరు మాత్రమే టీడీపీ, తక్కిన 36 మంది ఎమ్మెల్యేలు వైఎస్సార్‌సీపీ నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల పాత్ర ప్రధానంగా నిలుస్తోంది.

యువకులంతా వైఎస్సార్‌సీపీ వైపే..

పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ స్థానంలో 3.30 లక్షల మంది ఓటర్లు ఉండగా, అందులో దాదాపు 2 లక్షల మంది 45ఏళ్ల లోపు వయస్సు వారే ఉన్నారు. మొదటి నుంచి యూత్ వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తోంది. సచివాలయ వ్యవస్థ రూపొందించిన కారణంగా యువకులకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు దక్కాయి. మరికొందరు గ్రామాల్లోనే వలంటీర్లుగా ఉంటూ ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకున్నారు. ఈనేపథ్యంలో మెజార్టీ యువకులు వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. పైగా పోలీస్ నోటిఫికేషన్, గ్రూపు–1 నోటిఫికేషన్, ఉద్యోగార్థులకు వయో పరిమితి సడలింపు, వేతనాల పెంపు వంటి అంశాలు వెన్నపూస రవీంద్రారెడ్డికి అనుకూలం కానున్నాయి.

ముందంజలో రామచంద్రారెడ్డి...

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీలో వైఎస్సార్‌సీపీ బలపరుస్తున్న ఎంవీ రామచంద్రారెడ్డి ముందంజలో నిలుస్తున్నారు. పట్టభద్రుల తరహాలోనే టీచర్స్ ఎమ్మెల్సీ విజయానికి కూడా ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు విశేషంగా కృషి చేశారు. ఈయనకు పీడీఎఫ్ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డిల నుంచి ప్రధాన పోటీ ఉండనుంది. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి స్పీడ్‌కు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి బ్రేక్‌లు వేసినట్లు సమాచారం. టీచరు ఎమ్మెల్సీకి పోటీ ఎక్కువ కావడంతో మొదటి ప్రాధాన్యత వీలు కాకపోతే రెండో ప్రాధాన్యత ఓటు గెలుపోటములను నిర్ణయించనుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లు గణనీయంగా చీలిపోతున్నాయి. ప్రైవేట్ ఉపాధ్యాయుల మద్దతు ఏకపక్షంగా వైఎస్సార్‌సీపీకి దక్కుతుంది. ఈ పరిస్థితుల్లో ఎంవీ రామచంద్రారెడ్డి గెలుపు గుర్రం కానున్నట్లు పరిశీలకులు అంచనా వేస్తున్నారు. మొదటి నుంచి ఆధిపత్యం ప్రదర్శిస్తూ వచ్చినఈయన ప్రచారం తుది గడువు ముగిసే సమయానికి స్పష్టమైన ఆధిక్యత సాధించేలా మద్దతు కూడగట్టినట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

అందరూ జిల్లావాసులే

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోటీదారుల్లో ప్రధానమైన వారంతా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులే కావడంతో జిల్లాలో మరింత రసవత్తరంగా మారింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవి రామచంద్రారెడ్డి (కడప), పీడీఎఫ్ అభ్యర్థి కత్తినరసింహారెడ్డి(సుండుపల్లి), ఒంటేరు శ్రీనివాసులరెడ్డి (ప్రొద్దుటూరు), జీవీ నారాయణరెడ్డి(కడప), అనిల్‌కుమార్‌రెడ్డి (కొండాపురం సొంత మండలం కాగా తాడిపత్రిలో స్థిరపడ్డారు) తదితరులు ఉమ్మడి కడప జిల్లా వాసులు కావడంతో జిల్లా ఉపాధ్యాయ వర్గాల్లో ఉత్కంఠత నెలకొంది.

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలు ఓట్ల వివరాలు

స్థానం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
గ్రాడ్యుయేట్	358	3,30,124	2,22,339	1,07,752	33
ఉపాధ్యాయ	173	28,148	17,247	10,889	02

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వైఎస్సార్	52246	29063	8	81,317
కర్నూలు	42040	19592	1	61,633
నంద్యాల	38695	16230	4	54,929
అనంతపురం	45659	22672	10	68,341
శ్రీసత్యసాయి	29686	13620	4	43,310
అన్నమయ్య	14014	6574	6	20,594
మొత్తం	2,22,340	1,07,751	33	3,30,124

జిల్లాల వారిగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వైఎస్సార్	4390	3071	0	7461
కర్నూలు	2989	2402	1	5391
నంద్యాల	2806	1619	1	4426
అనంతపురం	3459	2104	0	5564
శ్రీసత్యసాయి	2277	1071	0	3348
అన్నమయ్య	1326	632	0	1958
మొత్తం	17247	10899	2	28148

పోలింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జేసీ సాయికాంత్‌వర్మ, శిక్షణా కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలిసి కలెక్టర్ విజయరామరాజు ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివారం ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సామగ్రిని పటిష్ట బందోబస్తు మధ్య తరలించాలని తెలిపారు. 21 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూట్‌ల వారీగా ఏర్పాటు చేసిన వాహనాలపై సమీక్షించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద కచ్చితంగా పోలింగ్ సిబ్బంది హాజరు నమోదు చేయాలన్నారు. ఒక్కొక్క పోలింగ్ స్టేషన్‌కు అదనపు సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పోలింగ్ సామగ్రిని తీసుకెళ్లే వాహనాల వెంట పోలింగ్ సిబ్బందితో పాటు ఒక పైలెట్ వాహనం, బందోబస్తు వాహనం ఉండేలా చూసుకోవాలన్నారు. 108 వాహనాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి కేంద్రం వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు యదుభూషణరెడ్డి, ఆనందనాయక్, ఎస్‌డీసీ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నోడల్ అధికారులు

ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది నియామకం

శాసనమండలి ఎన్నికల పోలింగ్ నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా నియమించామని జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎన్ఐసీలో ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈసీ మార్గదర్శకాల మేరకు మూడో దశ ర్యాండమైజేషన్ చేపట్టినట్లు జేసీ తెలిపారు. ఉపాధ్యాయ, పట్టభద్రులకు సంబంధించి జిల్లాలో 131 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 235 మంది పోలింగ్ సిబ్బంది కాగా, 22 మంది మైక్రో అబ్జర్వర్లను రిజర్వులో ఉంచామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఎన్ఐసీ డీఐఓ విజయ్‌కుమార్, సీపీఓ వెంకట్రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శివారెడ్డి, ఎన్ఐసీ డీఐఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలకు 13న సెలవు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలున్న పాఠశాలలకు 13న సాధారణ సెలవు దినంగా ప్రకటించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. మిగిలిన పాఠశాలలు యథాతథంగా పనిచేయవలసి ఉంటుందన్నారు.

ఫైనల్‌కు చేరిన హైదరాబాద్, అనంతపురం



తలపడుతున్న క్రీడాకారులు



89 పరుగులు చేసిన గోవా బ్యాట్స్‌మన్ అభిజిత్ కదమ్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ధనుంజయరెడ్డి మెమోరియల్ వెటరన్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్, అనంతపురం జట్లు ఫైనల్‌కు చేరాయి. ఆదివారం ఉదయం ఈ రెండు జట్లు ఫైనల్‌లో తలపడనున్నాయి. కాగా శనివారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో విజయవాడ, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంత జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. జట్టులోని లెనిన్ 40 పరుగులు చేశాడు. అనంత బౌలర్ గులాం 2, హరినాథ్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంత జట్టు 18.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 154 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఎస్.షాబుద్దీన్ 51 పరుగులు, సర్దార్ 42 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

గోవా జట్టు విజయం

మధ్యాహ్నం నిర్వహించిన మరో మ్యాచ్‌లో కడప, గోవా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన గోవా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. జట్టులోని శ్రీనివాస్ 49 పరుగులు చేశాడు. గోవా బౌలర్ అజీం 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గోవా జట్టు 19.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని అభిజిత్ కదమ్ 89 పరుగులు చేశాడు. కడప బౌలర్లు శ్రీనివాస్, ఖాదర్‌బాబా, అబ్దుల్ రెహమాన్ ఫరూఖ్ ఒక్కొక్క వికెట్ చొప్పున తీశారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక



కడప స్పోర్ట్స్: ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో వైఎస్సార్ జిల్లా మహిళల జట్టు విజేతగా నిలిచింది. టోర్నీలో విశేష ప్రతిభ కనబరిచిన శ్రీదేవి, దుర్గ, శృతి, రేష్మా, నిరీక్షణలను జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎస్.మహబూబ్‌బాషా తెలిపారు.

బ్యాలెట్ పేపర్ల పరిశీలన

కడప సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పేపర్లను కలెక్టర్ విజయరామరాజు శనివారం పరిశీలించారు. కలెక్టరేట్ సభా భవనంలో బ్యాలెట్ పేపర్ పరిశీలన, పోలింగ్ బూత్‌ల వారీగా ప్యాకింగ్ చేస్తున్న జంబో బ్యాలెట్ బాక్సులను కలెక్టర్ పరిశీలించారు.

ఎన్నికలకు పటిష్ట భద్రత: ఎస్పీ అన్బురాజన్



కడప అర్బన్: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పటిష్ట భద్రతాచర్యలు చేపట్టామని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలియజేశారు. పారదర్శక ఎన్నికల నిర్వహణకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమనిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. అభ్యర్థులు, ఓటర్లు, ఏజెంట్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని.. రిటర్నింగ్ అధికారి ఉత్తర్వులను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో వుంటుందని, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. ఎవరూ రెచ్చగొట్టేవిధంగా వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడటం చేయరాదన్నారు. డబ్బు, మద్యం, వస్తువులు ఎరచూపి ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రలోభాలకు పాల్పడరాదన్నారు. ఎవరైనా ఎన్నికల నియమాలను ఉల్లంఘించినా, అతిక్రమించినా, చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించినా ఎన్నికల కమిషన్, స్థానిక పోలీసులు లేదా డయల్ 100కు సమాచారమివ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

సీబీఐ విచారణలో కుట్ర కోణం

- వైఎస్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు యత్నం
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



రాజంపేట టౌన్ : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించిన విచారణను సీబీఐ నిష్పక్షపాతంగా జరపడం లేదని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీబీఐకి ప్రజల్లో విశ్వసనీయత ఉండేదని, అయితే వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి దస్తగిరి అనే వ్యక్తి అప్రూవర్‌గా మారి అతను చెప్పిన మాటలతో విచారణ సాగిస్తుండటంతో ఆ సంస్థ ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందన్నారు. కేవలం అవినాష్‌రెడ్డిపై కక్ష కట్టి ఆయనను వివేకా హత్య కేసులో ఇరికించాలనే కోణంలో కొన్ని దుష్టశక్తులు పని చేస్తున్నాయని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ చేసి అసలు దోషులను పట్టుకోవాలని తాము కూడా కోరుకుంటున్నట్లు తెలిపారు. వివేకా హత్య జరిగాక తొలిసారి ఫోన్ చేసి చెప్పింది శివప్రకాష్‌రెడ్డి అని, అందువల్ల ఆయనను విచారించాలని అవినాష్‌రెడ్డి కోరుతున్నా సీబీఐ పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్ష పార్టీలు వైఎస్ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు పెద్దఎత్తున కుట్రలు పన్నుతున్నాయని, అందులో భాగమే అవినాష్‌రెడ్డిని ఇరికించే ప్రయత్నం జరుగుతోందని తెలిపారు. ఇప్పటికైనా సీబీఐ నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

రాజంపేట : పట్టణ శివారులోని ఓ ఆలయంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని పోలీసులు శుక్రవారం రాత్రి అడ్డుకున్నారు. పట్టణ ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి శనివారం విలేకర్లకు వివరాలు వెల్లడించారు. స్థానిక ప్రభుత్వ సమీకృత బాలిక వసతి గృహంలో మైనర్ బాలికకు, ఓబులవారిపల్లె మండల చెన్నరాజుపోడుకు చెందిన యువకునికి వివాహం చేస్తున్నట్లు అందని సమాచారంతో ఎస్ఐతోపాటు సిబ్బంది వెళ్లారు. బాల్యవివాహం చేయడం నేరమని, అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ అధికారులు వచ్చి సంబంధీకుల నుంచి మేజర్ అయ్యే వరకు వివాహం చేయబోమని రాతపూర్వకంగా రాయించుకున్నారు.

సంచలనానికి నాంది..!

- 2011 మార్చి 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం
- వైఎస్సార్ సమాధి ఘాట్ వద్ద పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ
- అనునిత్యం ప్రజల్లో ఉంటూ.. అలుపెరగని పోరాటం
- చరిత్రను తిరగరాసేలా పట్టం కట్టిన ప్రజలు
- ఉమ్మడి జిల్లాలో 10 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలతోపాటు స్థానిక సంస్థల్లోనూ ఏకపక్షం
- వైఎస్సార్‌సీపీ 13వ వసంతంలోకి..



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మ తదితరులు (ఫైల్)

సాక్షి కడప : కష్టాలు.. కన్నీళ్లు.. బెదిరింపులు.. భయాందోళనల మధ్య ప్రజలకు తోడుగా నిలిచేందుకు ఆవిర్భవించిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. అప్పటి కాంగ్రెస్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేసే యోధుడు లేక ప్రజలు ఒక నాయకుడి కోసం ఎదురు చూస్తున్న సమయం. పాలనా పగ్గాలు చేతగాని కొంత మంది ప్రజలను వంచించే విధంగా ముందుకు వెళుతున్న సమయంలో పుట్టిందే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. 2011 మార్చి 12న ఆవిర్భవించింది.

వైఎస్సార్ ఘాట్ నుంచే శ్రీకారం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం మొదలుకొని ప్రతి కార్యక్రమం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి ఘాట్ వద్ద నుంచే ప్రారంభిస్తూ వచ్చారు. పార్టీకి సంబంధించి ఏ కార్యక్రమం తలపెట్టినా ఇడుపులపాయ నుంచే మొదలు పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోపాటు సోదరి వైఎస్ షర్మిలమ్మ కూడా ఇడుపులపాయ నుంచే పాదయాత్ర చేశారు. అలాగే పార్టీ ఆవిర్భావం.. జెండా ఆవిష్కరణ.. అభ్యర్థుల ప్రకటనలు.. నామినేషన్ పత్రాలు.. మొదటి ప్లీనరీ .. ఇలా ఏ కార్యక్రమం తలపెట్టినా వైఎస్సార్ ఘాట్ వద్దకు వచ్చి ఆశీస్సులు తీసుకున్న తర్వాతనే ముందుకు కదిలేవారు. అంతెందుకు పార్టీలో ఏ కార్యక్రమం చేపట్టినా.. నాయకులు ఏదైనా తలంచినా అమలు చేసేందుకు వైఎస్సార్ ఘాట్ వద్ద నుంచే శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా మారింది.

చరిత్ర తిరగరాసిన ఉప ఎన్నికలు

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బయటికి వచ్చిన అప్పటి ఎంపీ, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, తల్లి వైఎస్ విజయమ్మ (అప్పటి పులివెందుల ఎమ్మెల్యే)లు తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో భారీ విజయాన్ని దక్కించుకున్నారు. వారు అందుకున్న విజయం చరిత్ర నివ్వెరపోయేలా పులివెందుల, కడప పార్లమెంటు ప్రజలు తీర్పునిచ్చారు. 2011 మే నెలలో జరిగిన ఉప ఎన్నికలు దేశ స్థాయిలో చర్చ జరిగేలా చేశాయి. కాంగ్రెస్, టీడీపీ పెద్దలు జిల్లాలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కట్టడి చేయాలని రాష్ట్రంలోని నాయకులంతా వచ్చి పులివెందుల, కడపలో వాలినా ఏమాత్రం జంకు బొంకు లేకుండా ఒక్కడే నిలబడి పోరాడారు. ఫలితం అప్పట్లో జరిగిన ఉప ఎన్నికల్లో కడప ఎంపీ స్థానానికి సంబంధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున 5.44 లక్షలకు పైగా మెజార్టీతో అఖండ విజయం సాధించి పార్లమెంటు స్థాయిలో రికార్డు సృష్టించారు. మరో పక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవాధ్యక్షురాలు, వైఎస్ జగన్ తల్లి వైఎస్ విజయమ్మ కూడా ప్రత్యర్థిపై 80 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కూడా జిల్లాకు సంబంధించి రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటిలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఎన్నికలు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు విజయఢంకా మోగిస్తూ వస్తున్నారు.

అనునిత్యం ప్రజల్లో.. అందుకే పట్టం

2011 నుంచి మొన్నటి 2019 వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా.. ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం అనునిత్యం వారి మధ్యనే గడిపారు. నాటి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ప్రజా క్షేత్రంలో పోరాటాలు చేస్తూనే ముందుకు కదిలారు. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించారు. మన కోసం పోరాడుతున్న నేతకు పట్టం కట్టాలని నిర్ణయించుకుని 2019 సార్వత్రిక ఎన్నికల్లో 151 అసెంబ్లీ స్థానాలతోపాటు 22 లోక్‌సభ స్థానాలను అందించారు. అలా 2011 నుంచి 2019 వరకు ప్రజల్లో ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయడంతో నేడు ఆయన ప్రజా సేవలో అంకితమయ్యారు.

అన్ని ఎన్నికలు ఏకపక్షమే

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం కొనసాగుతోంది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని రెండు ఎంపీ స్థానాలతోపాటు 10 అసెంబ్లీ స్థానాలను కై వసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ అదే ఊపుతో తర్వాత జరిగిన అన్ని ఎన్నికల్లోనూ విజయ దుందుభి మోగించింది. ప్రజలు వైఎస్సార్‌సీపీకి ఏకపక్షంగా తీర్పునిస్తున్నారు. కార్పొరేషన్, మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఇలా ఎన్నికలు ఏవైనా జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. వైఎస్ కుటుంబంపై జిల్లా ప్రజలు తమ ప్రేమాభిమానాలను ఓట్ల రూపంలో చూపుతుండడంతో వైఎస్సార్ సీపీకి తిరుగులేని ఆధిక్యత లభిస్తోంది.

13 వసంతంలోకి వైఎస్సార్‌సీపీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి నేటి(ఆదివారం)కి సరిగ్గా పన్నెండేళ్లు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా పార్టీ తరఫున పలు కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించారు. పార్టీ కార్యాలయాల్లో జెండా ఆవిష్కరణలతోపాటు దివంగత వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకాలు, పూలమలలతో ఘనంగా నివాళులర్పించనున్నారు. అందుకు సంబంధించి ఇప్పటికే పార్టీ అధిష్టానం నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చింది.

సోమశిల వెనుక జలాల్లో మృతదేహం



నందలూరు(రాజంపేట) : నందలూరు మండల పరిధిలోని సోమశిల ప్రాజెక్ట్ వెనుక జలాలు(బ్యాక్‌వాటర్)లో శనివారం ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. కొండమాచుపల్లె (సోమశిల ముంపు గ్రామం) పరిధిలోని పల్లాగట్టు వద్ద నిలకడగా ఉన్న బ్యాక్‌వాటర్ నుంచి ఈ మృతదేహం కొట్టుకువచ్చింది. చనిపోయిన వ్యక్తి 35 ఏళ్ల వయసు కలిగి వుంటాడని, చేపలు పట్టి జీవించేందుకు వచ్చిన కూలీగా స్థానికులు చెబుతున్నారు. చేపల వ్యాపారస్తుడు ఇంటికి పంపకపోవడంతో నీళ్లలోకి దూకి పారిపోయే ప్రయత్నంలో మృతి చెందినట్లుగా ముంపువాసులు చెప్పుకొంటున్నారు. మృతదేహం సమాచారం అందుకున్న ఏఎస్ఐ సుబ్బరాయుడు, హెడ్‌కానిస్టేబల్ రహీం తమ సిబ్బందితో అక్కడికి వెళ్లే సరికి నీటి తాకిడి కొట్టుకుపోయినట్లుగా గుర్తించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ మృతదేహం పూర్తి వివరాలు తెలియవని, మృతదేహం నీటి ఉధృతికి కొట్టుకుపోయిందని, బయటపడితే గానీ చెప్పలేమని, స్థానికులకు సమాచారం ఇచ్చి వచ్చామన్నారు.

ఆరుగురు 'ఎర్ర' దొంగల అరెస్ట్

- 12 ఎర్రచందనం దుంగలు, కారు, రెండు ద్విచక్రవాహనాలు సీజ్
- ఇద్దరు పరారీ, వారి కోసం గాలింపు చర్యలు
- కడప డీఎఫ్ఓ పి.వి.సందీప్‌రెడ్డి



పట్టుకున్న ఎర్రచందనం దుంగలు, కారు, నిందితులతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లాలోని బద్వేల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరుగురిని కడప డీఎఫ్ఓ పి.వి సందీప్‌రెడ్డి పర్యవేక్షణలో బద్వేల్ అటవీశాఖ అధికారుల బృందం అరెస్ట్ చేసింది. వారి వద్ద నుంచి 12 ఎర్రచందనం దుంగలు, కారు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుంది. కడపలోని డీఎఫ్ఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎఫ్ఓ పి.వి. సందీప్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడానికి అటవీ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఇందులో భాగంగా బద్వేల్ రేంజ్ పరిధిలో వొత్తిమడుగు సెక్షన్ వారి ఆధ్వర్యంలో బాలాయపల్లె బీట్ పరిధిలోని లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్ జాలపాడికుంట ప్రదేశం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధంగా వుంచిన కారు తనిఖీ చేశారు. అందులోని 12 ఎర్రచందనం దుంగలు, వాటిని తరలించుటకు సిద్ధంగా వున్న ఆరుగురిని రెండు మోటార్‌సైకిళ్లతో పాటు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశారు. పారిపోయిన ఇద్దరు స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టయిన వారిలో కడప నగరం చిన్నచౌక్ నెహ్రూనగర్‌కు చెందిన చిదమల చంద్రశేఖర్, బద్వేల్ వెంకటాద్రినగర్‌కు చెందిన పోలిరెడ్డి నాగరాజు, పోలిరెడ్డి జానకిరామయ్య అలియాస్ జగన్, బ్రహ్మంగారిమఠం మండలం మలుగుడుపాడు గ్రామానికి చెందిన పెద్దుళ్లపల్లె ఓబులేసు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం దొరకట్టల గ్రామం కొండగాళ్ల యల్లంగ రాజు, బద్వేల్ వెంకటాద్రినగర్‌కు చెందిన పోలిరెడ్డి రామయ్య వున్నారు. వీరిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన బద్వేల్ రేంజ్ ఆఫీసర్ సి.మధుబాబు, కడప ఎఫ్ఆర్ఓ బాలసుబ్రమణ్యం, బద్వేల్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ వెంకటశేషయ్య, కడప డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, బద్వేల్ ఎఫ్‌బీఓలు రాజేష్ రెడ్డి, సుదర్శన్, స్పెషల్ పార్టీ సిబ్బంది, అటవీ సిబ్బందిని డీఎఫ్ఓ అభినందించారు.

అంతర్రాష్ట్ర స్మగ్లర్‌పై పీడీ యాక్ట్



లాల్ బాషా (ఫైల్)

కడప అర్బన్ : అంతర్ రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్ షేక్ సింపతి లాల్‌బాషాపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు జిల్లా ఎస్పీ కేకేఎస్ అన్బురాజన్ తెలియజేశారు. చాపాడు మండలం ఖాదర్‌పల్లి గ్రామానికి చెందిన లాల్‌బాషా 10 ఏళ్లుగా ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. అతడిపై 71 ఎర్రచందనం రవాణా, 85 దొంగతనం కేసులున్నాయి. అనేక మంది అంతర్జాతీయ ఎర్రచందనం స్మగ్లర్లతో సంబంధాలున్నాయి.

26 ఎర్రచందనం దుంగల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలతో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్ పరిధిలోని రోళ్లబోడు, సిద్దవటం బీట్ల అటవీ ప్రాంతాల్లో 26 ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేంజర్ ప్రసాద్ వివరాలు వెల్లడించారు. కడప డీఎఫ్ఓ సందీప్‌రెడ్డికి అందిన సమాచారం మేరకు రేంజర్‌తోపాటు సిబ్బంది మంగళవారం సాయంత్రం నుంచి సిద్దవటం రేంజ్‌లోని రోళ్లబోడు బీటు, సిద్దవటం బీట్లలో రెండు బృందాలుగా విడిపోయి కూంబింగ్ నిర్వహించారు. సిద్దవటం బీటులోని సాలుపెంట, ఉప్పుగుంతలు, చెంచల చలిమి రస్తా ప్రాంతానికి శుక్రవారం సాయంత్రానికి వెళ్లారు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు ఎర్రచందనం దుంగలను తీసుకెళ్తుండగా సిబ్బందిని చూసి పారిపోయారు. వారు వదిలేసి వెళ్లిన 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రోళ్ల బోడు బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న మరో బృందం శుక్రవారం సవర్ల బావి రస్తాకు చేరుకుంది. ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధం చేస్తున్న తమిళ కూలీలు వారిని చూసి పరారయ్యారు. అక్కడ ఉన్న 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. రెండు బీట్లలోని 26 ఎర్రచందనం దుంగలను సిద్దవటం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. వాటి బరువు 617 కిలోలు, విలువ రూ.2.77 లక్షలు ఉంటుందని రేంజర్ తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కూంబింగ్‌లో డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, ఏబీఓలు హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు శివారెడ్డి, శివరాం, నాగిరెడ్డి, సునీల్, మహేష్, అనీల్, సాబ్‌బావి, బంగ్లాబావి, బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండు చోట్ల చోరీలు

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి ఫర్నీచర్, ఇంకా సామగ్రిని అపహరించుకుని వెళ్లారు. ఈ మేరకు నిర్వాహకులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు. అలాగే ఎస్వీ డిగ్రీ కళాశాల సమీపంలో ఓ దుకాణానికి సంబంధించిన షెట్టర్‌ను పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు అందులోని సామగ్రిని దోచుకుని వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమాజ సేవకులు.. ఈ యువకులు

- కోవిడ్ నుంచి విస్తృత సేవలు
- చిన్న సంపాదనలోనే కార్యక్రమాలు
- ప్రజల నుంచి మన్ననలు



కోవిడ్ మృతునికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న విజయ్ బాబు



ఎస్ఐ చేతుల మీదుగా పారిశుద్ధ్య కార్మికులకు కూరగాయలు అందజేస్తున్న శ్రీనివాసులు

కమలాపురం : మనం ఎంత ఎత్తుకు ఎదిగినా ఏముంది గర్వ కారణం... మనతో పాటు సమాజంలో ఆసరా లేని వారికి తాము అండగా ఉంటే అది పదివేలు అనుకున్నారు.. ఆ యువకులు.. ఒక్కొక్కరు ఒక రకమైన సేవలు చేస్తూ ముందుకు సాగారు. ఉన్నట్లుండి కరోనా మహమ్మారి వచ్చేసింది. ప్రజలు ఎవరూ బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. కనీసం తిండి గింజలు, కూరగాయలు సైతం తెచ్చుకోలేని వందల కుటుంబాలకు వారు ఆసరాగా నిలిచారు. వారికి తోచిన విధంగా సాయం చేశారు. ప్రజలతో నీరాజనాలు అందుకున్నారు.. ఆ యువకులు..

'అభి' సేవలు అద్భుతం



కమలాపురం పట్టణానికి చెందిన నాగేశం విజయ్‌బాబు చిన్నప్పటి నుంచి సేవాగుణం అలవరచుకున్నాడు. ఈ క్రమంలోనే తన కళ్ల ముందు అనాథలు, యాచకులు మరణిస్తే తన తోటి మిత్రులు, సహచరులతో సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించేవాడు. పెద్దల సలహా మేరకు 2019లో ‹అభి› చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశాడు. తన సేవలను ట్రస్ట్ ద్వారా నిర్వహించసాగాడు. ఇంతలో పెద్ద అవాంతరం వచ్చి పడింది. కరోనా మహమ్మారితో ప్రజలు మృత్యువాత పడటం మొదలైంది. కరోనా మృతుల వద్దకు అయిన వారే వెళ్లలేని పరిస్థితి. ఆ సమయంలో ఖాజీపేట మండలం ఏటూరులో ఒకరు కరోనాతో మృతి చెందారు. అంత్యక్రియలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. అప్పుడు విజయ్‌బాబుకు ఫోన్ కాల్ వచ్చింది. పరిస్థితి అర్థం అయింది. ఏ మాత్రం భయం జంకు లేకుండా ట్రస్ట్ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ అర కిలోమీటర్ దూరం ఏట్లో, నడుములోతు నీటిలో శవాన్ని మోసుకెళ్లి నది అవతల సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. అప్పటి నుంచి కమలాపురం, వల్లూరు, ఎర్రగుంట్ల, పెండ్లిమర్రి మండలాల నుంచి కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాలని విజయ్ కుమార్‌కు ఫోన్‌లు వచ్చాయి. ఇలా తన సేవలు విస్తృతం అయ్యాయి. ఫస్ట్, సెకండ్ వేవ్‌లో 58 కరోనా మృతదేహాలకు ఆయన అంత్యక్రియలు నిర్వహించాడు. అలాగే రోడ్లపై మృతి చెందుతున్న 46 అనాథ శవాలకు సైతం అంత్యక్రియలు నిర్వహించాడు. విజయ్ సేవలను గుర్తించిన మరణాత గాస్పల్ యూనివర్సిటీ వారు బెంగుళూరులో అతనికి గౌరవ డాక్టరేట్ అందజేశారు.

చిరుద్యోగి సేవలు అనంతం

కమలాపురం నగర పంచాయతీలో చిరుద్యోగిగా పని చేస్తున్న శీలం శ్రీనివాసులు తన సంపాదనలోనే ఎంతో కొంత దానం చేయాలనే సంకల్పం కలిగిన వ్యక్తి. దీంతో అతడు ముందుగా వేసవి కాలంలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేవాడు. 2020లో మన ఊరు సేవాసమితి ద్వారా తన సేవలను విస్తృతం చేశాడు. కరోనా రాకతో అందరూ ఇళ్లకు పరిమితం అయ్యారు. నిరుపేద కుటుంబాలకు కనీసం కూరగాయలు అయినా పంచాలనే నిర్ణయానికి వచ్చాడు. ఫస్ట్ లాక్‌డౌన్‌లో 1500 కుటుంబాలకు అప్పటి కమలాపురం ఎస్ఐ రాజారెడ్డి చేతుల మీదుగా కూరగాయలు పంపిణీ చేశాడు. అలాగే సెకండ్ వేవ్‌లో సైతం 500 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశాడు. అంతటితో ఆగకుండా తన శక్తి మేరకు లాక్‌డౌన్ సమయంలో భోజన ప్యాకెట్లు పంపిణీ చేశాడు. అలాగే కమలాపురం, వల్లూరు మండలాల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పండ్లు, కూరగాయలు పంపిణీ చేశాడు. ఇటీవల సంభవించిన తుపాను కారణంగా వరద నీరు వచ్చిన చేరిన కె.కొత్తపల్లెలో 100 కుటుంబాలకు ఐదు రోజుల పాటు భోజన పాకెట్లు సరఫరా చేశాడు. దివ్యాంగ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశాడు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశాడు. సంక్రాంతి సందర్భంగా పెరాలసిస్ రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశాడు. కమిటీ సభ్యుల సహకారంతో 15 కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాడు. మండలంలోని మండల స్థాయి అధికారుల చేత శభాష్ శీను అనిపించుకున్న ఘనత పొందాడు.

రక్త ప్రదాత



రక్తదానం చేస్తున్న జూటూరు విజయ్

ఎవరికైనా రక్తం కావాలంటే తక్కున కమలాపురం పట్టణానికి చెందిన జూటూరు విజయ్‌కు ఫోన్ కాల్ వస్తుంది. అంతగా రక్త ప్రదాతగా నిలిచాడంటే మామూలు మాట కాదండోయ్. 31 ఏళ్ల వయసులోనే 26 సార్లు రక్తదానం చేశాడంటే అతని సేవాగుణం ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. అలాగే ఖాజీపేటలో ఒక శిబిరం, కమలాపురంలో నాలుగు సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 500 మందికి పైగా విద్యార్థులతో రక్తదానం చేయించాడు. అడపాదడపా సేవా కార్యక్రమాలు చేస్తున్న జూటూరు విజయ్ 2018 ఏప్రిల్‌లో మదర్ థెరిసా సేవా సమితి ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను విస్తృతం చేశాడు. ముందుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేద్దామని రిమ్స్‌లో అధికారులను కలవడానికి వెళ్తే అక్కడ ఇద్దరు 5, 7 ఏళ్ల అక్కా, చెల్లెలు తలసేమియా వ్యాధితో బాధ పడుతూ రక్తం కోసం ఎదురు చూడటం తన కంట కన్నీరు తెప్పించింది. అప్పటి నుంచి ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేస్తున్నాడు. కరోనా సమయంలో బ్లడ్ బ్యాంకులన్నీ ఖాళీగా ఉన్నాయని బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు విజయ్ దృష్టికి తీసుకురాగా వీలైనంత మంది యువకులను కడప తదితర ప్రాంతాలకు తీసుకెళ్లి రక్తదానం చేయించిన ఘనత విజయ్‌కే దక్కుతుంది. అలాగే కోవిడ్ సమయంలో 5 మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించాడు. అధికారులకు, విద్యార్థులకు దాతల సహకారంతో మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశాడు. విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తూ పరీక్షల్లో మంచి మార్కులు తీసుకు రావడానికి సైతం విజయ్ కృషి చేస్తున్నాడు. ఇటీవల ఇతర సంస్థల సహకారంతో నిరుద్యోగులకు ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇప్పిస్తున్నాడు. ఇలా పలు రకాలుగా సేవలు చేస్తూ పట్టణ ప్రజలతో కృతజ్ఞతలు అందుకుంటున్నాడు.